క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం అధిక శ్రావణ మాసం సప్తమి పురస్కరించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. భక్తుల కోసం దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు.

గాలికుంటు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు పాటించాలి

రంగంపేట: వర్షాకాలం నేపథ్యంలో మేకలు, గొర్రెలకు గాలికుంటు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు పాటించాలని మండల పశువైద్యాధికారి ఈ.జాన్‌పాల్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మేతకు వెళ్లే మేకలు, గొర్రెల మందలు వర్షంలో తడవడం, మురికి కుంటల్లో, నిల్వ ఉన్న నీటిలో అధిక సమయం ఉండటం వల్ల ఈ వ్యాధి సోకుతుందన్నారు. వ్యాధి లక్షణాలు గుర్తించిన వెంటనే పశువులకు సరైన చికిత్స అందించాలన్నారు. వ్యాధి సోకిన గిట్టలను 10 శాతం జింక్ సల్ఫేట్ ద్రావణం లేక 5 శాతం ఫార్మలిన్ ద్రావణంతో శుభ్రం చేయాలన్నారు. వైద్యుల సూచనల మేరకు యాంటీబయాటిక్ మందులతో పూత పూయాలన్నారు. గాలికుంటు వ్యాధి రాకుండా మేకలకు, గొర్రెలకు పీపీఆర్ వ్యాక్సిన్ కచ్చితంగా వేయించాలన్నారు.

అచ్యుతాపురంలో మినీ ఫిష్ ఆంధ్ర షాపు ప్రారంభం

గోకవరం: అచ్యుతాపురం గ్రామంలో మినీ ఫిష్ ఆంధ్ర షాపును మంగళవారం ప్రారంభించారు. మత్యశాఖ ద్వారా బ్రతికి ఉన్న చేపలు, ఎండు చేపలు, సముద్రం చేపలను భద్రపరుచుకోవడానికి రూ.1.75 లక్షలు విలువైన సామగ్రిని సబ్సిడీపై అందించగా వీటి అమ్మకాలను గ్రామపెద్దలు ఆకుల సత్యనారాయణ, కోలా మల్లిఖార్జునరావు, కొత్తపల్లి సత్యన్నారాయణ, నల్లల నాగేశ్వరరావు, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ గణేశ్వరరావు ప్రారంభించారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌లో వైద్యసేవలు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలు అందించారు. మంగళవారం రఘుదేవపురంలో డాక్టర్ రాజు ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించి, వివిధ రోగాలకు వైద్య సేవలు అందించారు. పంచాయతీ కార్యాలయం వద్ద గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సెంటర్లను సందర్శించి బాలింతలు, గర్భిణులకు వైద్య సేవలు అందించడమే కాకుండా సెంటర్‌లోని పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, బరువు తక్కువగా ఉన్న పిల్లలకు అందించాల్సిన ఆహారంపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు



ధ్రువపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గీతావరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి



వేండ్రలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న సర్పంచ్ వాసు



రంగాపురంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న సర్పంచ్ గండికోట వీరభద్రరావు

అనపర్తి: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సత్వర సేవలు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని పులుగుర్తలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సాంకేతిక, ఇతర కారణాల వల్ల అర్హులెవరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదన్న లక్ష్యంతో అమలుచేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోందన్నారు. అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి మాట్లాడుతూ జగనన్న సురక్ష శిబిరాల్లో వందలాది మందికి ధ్రువపత్రాలు అందుతున్నాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ కాకరపర్తి వేణు, ఉపసర్పంచ్ భామిరెడ్డి, తహసీల్దార్ సరస్వతి, ఈఓపీఆర్డీ పద్మజ, సచివాలయ కార్యదర్శి ఎస్.సుబ్బారావు, అనపర్తి గోపాలకృష్ణ, సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

11,633 మందికి ధ్రువపత్రాల పంపిణీ

పెదపూడి: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలో మొత్తంగా 11,633 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశామని ఎంపీడీఓ పి.విజయభాస్కర్ తెలిపారు. వేండ్ర గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్ మాట్లాడుతూ మండలంలోని 20 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం పూర్తయిందన్నారు. లబ్ధిదారులకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా, ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా గంటల వ్యవధిలోనే ధ్రువపత్రాలు అందించామని చెప్పారు. అనంతరం సర్పంచ్ కోసూరి వాసు చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సుభాష్, మండల రైతు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నర్ల సాంబమూర్తి, ఎంపీటీసీ సభ్యులు ఆచంట త్రిమూర్తులు, సుంకర వీరాస్వామి నాయుడు, వీఆర్వో లంకకుమార్ పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ పాలన

బిక్కవోలు: ప్రజల ముంగిటకే సంక్షేమ పాలనను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని సర్పంచ్ గండికోట వీరభద్రరావు అన్నారు. మంగళవారం రంగాపురంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలోని ఈవోపీఆర్డీ భవాని, కార్యదర్శి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బిక్కవోలులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ జంగా వీర వెంకట సుబ్బారెడ్డి, ఎంపీడీవో జేఏ ఝాన్సీ, డీటీ కృష్ణ, వైస్ ఎంపీపీ బుద్దాల కన్నారావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో సర్టిఫికెట్ల అందజేత



గుమ్ములూరులో సర్టిఫికెట్లు అందజేస్తున్న నాయకులు, అధికారులు

మధురపూడి: జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజల ఆర్థిక పురోభివృద్ధికి దోహదపడుతోందని ఏఎంసీ చైర్మన్, సర్పంచ్ నక్కా రాంబాబు అన్నారు. మంగళవారం కోరుకొండ మండలం గుమ్ములూరు గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన వ్యవసాయ సలహామండలి చైర్మన్ క్రొవ్విడి సత్రాజు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మండలంలోని 20 గ్రామ సచివాలయాల ద్వారా 32,000 మందికి సర్టిఫికెట్లు అందజేసినట్టు తెలిపారు. వ్యవసాయ రంగం అభివృద్ధితో పాటు, వివిధ రంగాలభివృద్ధి జగనన్న పాలనలోనే జరిగిందన్నారు. నవరత్నాలు అందరికీ అందించాలనే ఉద్దేశంతో ప్రజలకు 11 రకాల సర్టిఫికెట్లు అందజేయడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గుమ్ములూరు, దోసకాయలపల్లి గ్రామాల్లో 2,425 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు అడపా కనకరాజు, గణేశుల పోసి, సర్పంచుల సమాఖ్య మండలాధ్యక్షుడు కడియాల పాపారావు, ఎంపీటీసీ సభ్యులు లక్ష్మణరావు, బేదంపూడి పాపా, మాజీ సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ నరేష్‌కుమార్, తహసీల్దార్ పాపారావు పాల్గొన్నారు.

తగ్గుతున్న గోదావరి వరద



ముగ్గళ్ళ రేవు వద్ద గోదావరి వరద నీరు

సీతానగరం: గోదావరి వరద మంగళవారం తగ్గుముఖం పట్టింది. బొబ్బిల్లంక, ములకల్లంక మధ్య ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన బోట్లపై స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. ములకల్లంకలో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్యంపై దృష్టి సారించారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు. బొబ్బిల్లంక, జాలిమూడి మధ్య బలహీనంగా ఉన్న ఏటిగట్టు వద్ద ఇసుకను సిద్ధంగా ఉంచారు. గోదావరి వరద మరింత పెరిగితే ఇసుక బస్తాలను వేసి, గట్టును పటిష్టపర్చే విధంగా చర్యలు తీసుకోవడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు. కాటవరం, ముగ్గళ్ళ, మునికూడలి రేవులలో ఏటిగట్టును పటిష్టపర్చడానికి ఇసుకను సిద్ధంగా ఉంచారు. రేవులలో స్థానికులు గోదావరి వరదలో కొట్టుకొస్తున్న కలపను తీసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గోదావరి వరద తగ్గుముఖం పట్టడంతో అధికారులు, మండల ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు.

175 క్యూసెక్కుల సాగునీరు విడుదల

సీతానగరం: మండలంలోని పురుషోత్తపట్నం తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకం నుంచి 175 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశామని జలవనరుల శాఖ డీఈ వెంకట్రావు మంగళవారం తెలిపారు. పుష్కర-1 నుంచి ఒక మోటారు ద్వారా మెట్ట ప్రాంత పంటపొలాలకు సాగునీటిని విడుదల చేశామన్నారు. ఈ నెల 24 మధ్యాహ్నం వరకు రెండు మోటార్ల ద్వారా 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని, వర్షాలు కురుస్తున్నందున పై అధికారుల సూచనల మేరకు 175 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

మళ్లీ అధికారం వైఎస్సార్ సీపీదే

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- కొంకుదురులో గడప గడపకూ మన ప్రభుత్వం



కొంకుదురులో జరిగిన గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కొంకుదురులో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేయడం తగదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షాన నిలబడి సంక్షేమాన్ని చేరువ చేస్తున్నారని చెప్పారు. స్వచ్ఛందంగా సేవ చేస్తున్న వలంటీర్ల వ్యవస్థపై తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తి వీరమణి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొంకుదురు పీవీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ రొంగల అప్పాజీ, వైఎస్సార్‌సీపీ మండలం కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, కొమరిపాలెం ఉపసర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, మల్లిడి కోదండం తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా పనిచేయాలి

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడిలోని ఒక ఫంక్షన్‌హాలులో మంగళవారం టీడీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేశ్ మాట్లాడుతూ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు.

పారదర్శకంగా ఓటరు సర్వే

రంగంపేట: మండలంలో ఓటర్ సర్వే పారదర్శకంగా నిర్వహిస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం.దొరకయ్య అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ పార్టీల నాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 21 నుంచి బూత్ లెవల్ అధికారులు చేపట్టిన ఇంటింటి సర్వే ఆగస్టు నెల 21 వరకూ జరుగుతుందన్నారు. సర్వేలో బీఎల్‌ఓలు ఇంటి నంబర్లు, పేరు మార్పు, కొత్త ఓటర్ల నమోదు తదితర వివరాలు సేకరిస్తారని చెప్పారు. దీనిపై ప్రతి మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి సర్వే వివరాలను తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడికి గురి కావొద్దు

బిక్కవోలు: విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకూడదని మానసిక వైద్యులు తేతలి రామారెడ్డి అన్నారు. మంగళవారం బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద మానసిక ఒత్తిడిని ఎలా అధిగమించాలన్న అంశంపై విద్యార్థులకు ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. రోజూ ఒత్తిడిని అధిగమించి చదువుకోవడం గురించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకరరావు, ఉపాధ్యాయులు జంగా శ్రీనివాస్‌ప్రసాద్, పీఎస్ఎన్ రెడ్డి, ప్రసన్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో బాధ్యతగా పనిచేయాలి



అంగన్‌వాడీ సిబ్బందికి నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా అంగన్‌వాడీ సిబ్బంది నిబద్ధతతో బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని బిక్కవోలు, అనపర్తి మండలాల పరిధిలోని కొమరిపాలెం, దుప్పలపూడి గ్రామాల్లో నూతనంగా ఎంపికైన అంగన్‌వాడీ సిబ్బందికి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు మంగళవారం అందజేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నాడు-నేడు పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తోందని, దీంతో అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మారుతున్నాయన్నారు. గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ, చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, ఎంపీటీసీ కొండేటి భీమేష్, ఉపసర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహనబాలకృష్ణారెడ్డి, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు పాదూరి డేవిడ్‌రాజు, విజయకుమారి, తుమ్మా సత్తిబాబు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన 13 మంది వీఓఏలు

అనపర్తి: మండలంలోని దుప్పలపూడి, మహేంద్రవాడ, కొప్పవరం, లక్ష్మీనరసాపురం, అనపర్తి గ్రామాల పరిధిలో 13 మంది వీఓఏలు మంగళవారం విధుల్లో చేరినట్లు ఏపీఎం జిలాని తెలిపారు. గతంలో విధుల్లో నిర్లక్ష్యం వహించిన 13 మంది వీఓఏలను కలెక్టర్ సస్పెండ్ చేయడంతో కొత్తగా మరో 13 మందిని ఎన్నుకున్నామన్నారు. మహేంద్రవాడలో తాపేశ్వరపు దుర్గాదేవి, ముప్పిడి పాప, దుప్పలపూడిలో పంచకట్ల సునీత, కొప్పవరంలో కాకిలేటి స్వర్ణ, లక్ష్మీనరసాపురంలో సురకాసుల వసంతలక్ష్మి, అనపర్తి నుంచి షేక్ మనీషా, సేనాపతి దుర్గాలక్ష్మి, షేక్ లాల్ మనీషా, వీరల కనకదుర్గ, బొర్రా నాగలక్ష్మి, సత్తి అరుణసాయిరత్నం, చింతపల్లి దుర్గాభవాని, ఉమ్మిడి దివ్యదీప్తిలు విధుల్లో చేరినట్లు తెలిపారు.

మత్తుకు దూరంగా ఉండండి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూషకుమారి

రాజానగరం: మత్తుకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తును ఏర్పరుచుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూషకుమారి యువతకు హితవు పలికారు. 'మాదక ద్రవ్యాల వినియోగం - ఎదురయ్యే అనర్థాలు, ర్యాగింగ్ నివారణ' అనే అంశాలపై గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో సంక్షేమ శాఖ, పోలీసు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న న్యాయమూర్తి ప్రత్యూషకుమారి మాట్లాడుతూ జీవితంలో విద్యార్థి దశ ఎంతో ఉన్నతమైనదని, దానిని ఏవిధంగా మలచుకుంటే మీ భవిష్యత్తు కూడా అదే విధంగా ఉంటుందనే విషయాన్ని గ్రహించాలన్నారు. మీ ధ్యాస ఎప్పుడు చదువుపైనే ఉండాలని సూచించారు. మత్తుకు బానిసలైనా, ర్యాగింగ్‌లకు పాల్పడినా నేరస్తులుగా పరిగణింపబడి, భవిష్యత్తును నాశనం చేసుకున్నవారవుతారని హెచ్చరించారు. అడిషనల్ ఎస్పీ జి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను కలిగివుండటమే కాదు, అటువంటి వ్యక్తులతో కలిసివున్నా నేరస్తులే అవుతారన్నారు. ఇదే విషయమై పదవీ విరమణ చేసిన డీఎస్పీ ఎన్. బాబ్జి విద్యార్థులను చైతన్యపరుస్తూ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.రామ్‌కుమార్, సీఐలు కాశీవిశ్వనాథ్, పి. వెంకటరమణ, వీఏరావు, ఎస్సై సుధాకర్, గైట్ కాలేజీ డీన్ డాక్టర్ కుసుమకుమారి పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి

రంగంపేట: విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖాధికారి కె. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన హైస్కూల్ స్థాయి గణిత శాస్త్ర ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతకు ముందు ఈలకొలను కాంప్లెక్స్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయా కాంప్లెక్స్‌ల కార్యదర్శులు, రిసోర్స్ పర్సన్స్, సీఆర్పీలు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం స్పందించాలి

పెదపూడి: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న మారణకాండపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి శాంతిని నెలకొల్పాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) శాఖ రాష్ట్ర ప్రతినిధి సమ్మంగి శ్రీరాములు కోరారు. పెదపూడి మండల విద్యా వనరుల కార్యాలయం వద్ద మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో మణిపూర్ అల్లర్లపై నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పంపన సత్యనారాయణ, డీఆర్‌కే వర్మ, కె.పెద్దిరాజు, జి.నాగేంద్రప్రసాద్, వి.రత్నవల్లి పాల్గొన్నారు.

శాంతిభద్రతలు నెలకొల్పాలి

పెదపూడి: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న గొడవలను వెంటనే అదుపు చేసి శాంతి భద్రతలు నెలకొల్పాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.రాజేశ్వరి డిమాండ్ చేశారు. మంగళవారం శహపురంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్యకర్తలు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ, అంగన్‌వాడీ వర్కర్ల ప్రతినిధులు కుమారి, బాంధవి, భారతి పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ర్యాలీ

గోకవరం: మణిపూర్ ఘటనను నిరసిస్తూ గోకవరంలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది, యానిమేటర్లు, ఆశాకార్యకర్తలు తదితరులు పంచాయతీ కార్యాలయం నుంచి మొదలుకొని ఆర్టీసీ బస్టాండ్ వరకూ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ ఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.